# భూమిక 'భూమిక'

ఆరోజు క్లబ్‌లో తోటి మెంబర్సుతో చర్చించుకోవలసిన కార్యక్రమాల జాబితా చూసుకుంటోంది లయనెస్ విదిత. ఒకటి "సామూహిక వర్ణాంతర వివాహాల కార్యక్రమం.

ఈ కార్యక్రమానికి ఫోటోగ్రాఫర్‌ని పిలవాలి. క్లబ్‌లో ముఖ్యమైన మెంబర్స్‌లో కొందరినైనా జంటలతోపాటు ఫోటోలు తీసి పేపర్స్‌లో పబ్లిష్ చెయ్యాలి. లేకపోతే వాళ్లకి కోపం వస్తుంది.

* కథల పోటీలో మూడవ బహుమతి రూ. 1,500 పొందిన కథ *

రెండోది: పేద విద్యార్థులకు పుస్తకాలు యూనిఫారమ్ బట్టలు పంచిపెట్టాలి. ఈ కార్యక్రమానికి యాభై వరకు పేద విద్యార్థినులను ఎంచుకోవాలని నిర్ణయించుకున్నారు. ఎవరెవరినీ అనేది ఇంకా తేల్లేదు. ప్రెసిడెంటు రికమెండ్ చేసిన వాళ్లు పదిమంది. సెక్రటరీ మరీ ఆశపోతు. ముప్ఫైమందివరకూ తనవాళ్ల సంఖ్య తేల్చింది. అప్పటికి నలభై అయిపోయింది. ఇంకెందరున్నారని? పదిమంది.

పేద విద్యార్థులకు పుస్తకాలు బట్టలు పంచుతున్నారని తెలిసి తనదగ్గిరికి ఎంతోమంది వచ్చారు. సాయం చెయ్యమని ప్రాధేయపడుతూ. ఈ ప్రెసిడెంటు, సెక్రటరీ ముందుకు ముందు తమకి కావలసిన వాళ్లపేర్లు చేర్చేసారు. ఇప్పుడు తనకి ఛాన్సులేకుండా పోయింది. సెక్రటరీకి ఎమ్.ఎల్.ఏ గారి భార్యనని మహా గర్వంగా వుంది.

ఈసారి ఎలక్షన్సులో అతడు ఓడిపోతే సెక్రటరీని మార్చేయాలి. మూడవది. వితంతు పునర్వివాహాలు. ఈ ప్రోగ్రాం అంతబాగా రాణించేలా లేదు. ఈ రోజుల్లో ఎవ్వరూ మేము వితంతువులమని ముందుకు రావడంలేదు. వైస్ ప్రెసిడెంట్ తనకి తెలిసిన వాళ్లెవరో యిద్దరున్నారంది. చూడాలి వాళ్లెవరో?


ఆయావచ్చి, "అమ్మా! ఎవరో వచ్చారు మీకోసం", అంది. లయన్సుక్లబ్‌లో పనిచేసే ఆయా ఇంటి దగ్గిర కూడా పనిచేస్తుంది. అలా చేస్తేనే తప్ప ఆయాగా పెట్టుకోనని ముందే చెప్పింది లయనెస్ విదిత.

"హాల్లో కూర్చోబెట్టు వస్తున్నాను", చెప్పింది. ఫైల్సుపక్కన పెట్టేసి నేరుగా అద్దంముందుకు నడిచింది. వార్డు రోబ్‌లోంచి కొత్తగా కొన్న బెనారస్ ఆర్గంజా చీర తీసి కట్టుకుంది. రోజ్‌కలరు పౌడర్ కేక్ పఫ్‌తో మొహంమీద దట్టంగా పులుముకుని పింక్ కలర్ లిప్‌స్టిక్ పెదవులమీద రుద్దుకుంది. ఐబ్రోపెన్సిల్‌తో కనుబొమ్మలు కనుకొలకులు తీర్చుకుంది. నుదుటిమీద ముంగురులు పడేలా స్టైల్‌గా జుట్టు రేపుకుంది. కుచ్చెళ్లు ఒకచేత్తో చెదిరిపోకుండా పట్టుకుని వయ్యారంగ నడుచుకుంటూ హాల్లోకి వచ్చి, "హాల్లో!" అని పలకరించబోయి ఆగిపోయింది. అక్కడ కూర్చున్నది ప్రముఖవ్యక్తి ఎవరో కాదు. యూనిఫాంలో వున్న పోలీసు కానిస్టేబుల్. ఏదో ఫేవర్‌కోసం వచ్చి వుంటాడు.

ముందుగానే వచ్చిందెవరో చెప్పనందుకు ఆయామీద కోపం వచ్చింది. కూర్చోకుండా నిలబడే, "ఏంకావాలి?" అని అడిగింది అతి నిర్లక్ష్యంగా. లేచి నిలబడ్డాడు పోలీసు కానిస్టేబుల్. ఇండస్ట్రియలిస్టు మేఘ శ్యామ్ భార్యను గౌరవించాలని అతనికి తెలుసు.

"మా ఎస్.ఐ. మిమ్మల్నొకసారి పోలీసు స్టేషనుకి రమ్మంటున్నారు". వళ్లు తెలియని కోపం వచ్చింది విదితకి. స్టైల్ మాట మర్చిపోయి హూంకరిస్తూ, "ఏమిటీ! నేను పోలీసు స్టేషనుకురావాలా! నాతో ఏమైనా పనివుంటే మీ ఎస్.ఐనే యిక్కడికి రమ్మను" అంది.

"ఎస్.ఐ.వచ్చేవారే కానండి, పోలీసుస్టేషన్‌లో వున్న మీ అమ్మాయిగారు మాత్రం ఎన్నివిధాల బతిమాలినా



ఇక్కడికి రానన్నారు." కాళ్లూచేతులూ చల్లబడినట్లైంది విదితకి. కానిస్టేబుల్ ముఖం మీద కనీ కనబడని చిరునవ్వు మెరిసింది. అది చూసి చిరచిరలాడింది. వెంటనే పోలీసు స్టేషన్‌కి ఫోన్ చేసి ఎస్.ఐ.ని లైనులోకి పిలవమని ఆజ్ఞాపించింది. ఎస్.ఐ. లైనులోకి రాగానే, "మా అమ్మాయి భూమిక మీ పోలీసు స్టేషన్‌లో వుందా! వెంటనే యింటికి తీసుకురండి," అంది ఆజ్ఞాపిస్తున్న ధోరణిలో.

"సారీ మేడమ్! మీ అమ్మాయి యిక్కడికి మీ మీదకంప్లైంటుయియ్యడానికొచ్చింది. మేజర్ అయిన ఆ అమ్మాయిని బలవంతంగా మీ దగ్గిరికి తీసుకొచ్చే అధికారం నాకులేదు. మీరు పోలీసుస్టేషనుకొచ్చి మీ అమ్మాయితో మాట్లాడుతారేమోనని మీ దగ్గిరికి మనిషిని పంపాను. మీ యిష్టమైతే రండి లేకపోతే లేదు. మీరు నిర్బంధంగా మీ అమ్మాయిని యింటికి తీసికెళ్లే ప్రయత్నాలు చేస్తే మీ అమ్మాయి యిచ్చిన కంప్లైంటు మీరే నిరూపించిన వారౌతారు." రిసీవరు పట్టుకొన్న చెయ్యివణికింది విదితకి. "ఇప్పుడే వస్తున్నాను," బింకంగా అని ఫోను పెట్టేసింది. చేతులుకట్టుకు నిలబడ్డ కానిస్టేబుల్‌తో, "ఇంక నువ్వెళ్లొచ్చు" అంది రుసరుసలాడుతూ. అతను వెళ్లిపోయాడు. తనలో తను నవ్వుకుంటున్నట్లు తోచింది ఆమెకి. మరింత చిరాకు పడిపోతూ వెంటనే బయలుదేరబోయి అంతలో మనసు మార్చుకుని మళ్లీ అద్దంముందు కొచ్చింది. బెనారస్ ఆర్గంజా చీర మార్చేసి ఫారిన్ షిఫాన్ చీరకట్టుకుంది. పెద్దదానిలా కనిపిస్తానేమోనని ఆవిడ పట్టుచీరలు కట్టుకోదు. మరోసారి పౌడర్ లిప్‌స్టిక్ వగైరాలుసరిచూసుకుని కార్లో పోలీసు స్టేషనుకి బయలుదేరింది. భూమిక ఎస్.ఐ. ఎదురుగా ఒక కుర్చీలో కూర్చుని అతడు ఆఫర్ చేసిన టీ సిప్‌చేస్తూ, అతన్తో సరదాగా కబుర్లుచెప్తోంది. ప్రింటెడ్ వాయిల్‌చీరలో అతి నిరాడంబరంగా వుందామ్మాయి. చెవులకి రెండు బంగారు రింగులు తప్ప ఏ ఆభరణాలు లేవు. తన కూతుర్ని అక్కడ అలా చూసేసరికి రగిలిపోయింది విదిత. లయనెస్ విదితగారి అమ్మాయి అంటే ఎలా వుండాలి? ఎవరూ కూర్చోమనకుండానే అక్కడ కుర్చీలో కూర్చుని, "ఇంటికినడు," అంది కూతురితో. నవ్వుతూన్న భూమిక చటుక్కున అతి నిర్లక్ష్యంగామారిపోయింది. కాలిమీద కాలేసుకుని కుర్చీలో వెనక్కి వాలి పెంకెగా నవ్వింది.

"ఇల్లా! ఎవరిల్లు?"

"అతితెలివి చూపించకు. ఎవరింటికి వెళ్తావు నువ్వు? మనయింటికే వచ్చేయి".

"మన" అని చెప్పకోవడానికి నాకెవ్వరూ లేరు "నా" యిల్లు నాకుంది."

"నీయిల్లా! అదెక్కడుంది?"

"నీకు చెప్పవలసిన అవసరం నాకులేదు"

"ఏమిటామాటలు?"

"ఇన్‌స్పెక్టర్! నేనిచ్చిన కంప్లైంటు పేపరు మా అమ్మకివ్వండి" తల్లి మాటలకు సమాధానం చెప్పకుండా ఇన్‌స్పెక్టరుతో అంది. కంప్లైంట్ పేపరు విదిత ముందుంచాడు ఎస్.ఐ.

"పోలీసు కమీషనరు గారికి!

నాపేరు భూమిక, నిన్నటితో సరిగ్గా నాకు మైనారిటీ తీరిపోయింది. నాతల్లిదండ్రులు నన్ను ప్రేమాదరాలతో చూడడంలేదు. వాళ్లవల్ల కలుగుతోన్న శారీరక, మానసిక యాతనలు నేను భరించలేకపోతున్నాను. నేను చదువుకున్నాను. ఉద్యోగం దొరికింది. తల్లిదండ్రులతో నిమిత్తం లేకుండా స్వతంత్రంగా జీవించాలని నిర్ణయించుకున్నాను. అయితే మా అమ్మ మొండి పట్టుదల మనిషి. మానాన్న స్వంతంగా యేదేనా ఆలోచించడానికేనా తీరికలేని బడా పారిశ్రామికవేత్త. అంచేత వాళ్లిద్దరూ నన్ను ఎలాగైనా నిర్బంధించి యింటికి తీసుకుపోతారని భయంగా వుంది. అలాజరిగితే నేను ఆత్మహత్యయినా చేసుకుంటాను కాని నా తల్లిదండ్రులతో కలిసి మాత్రం జీవించలేను. ఒకవేళ ముందు ముందు నేను ఆత్మహత్య చేసుకుంటే అందుకు నా తల్లిదండ్రులే బాధ్యులని వ్రాతపూర్వకంగా తెలియపరుస్తున్నాను. మేజర్‌నైన నాకు నా తల్లిదండ్రుల బారినుండి రక్షణ కల్పించ వలసిందిగా పోలీసువారిని కోరుకుంటున్నాను.

ఇట్లు

భూమిక

ఉత్తరం చదవడం పూర్తిచేసి, పొంగివస్తున్న కోపాన్ని అణచుకొంటూ,

"ఏమిటే ఉత్తరం?" అంది విదిత.

"నీకు చదువొచ్చుకదా! చదువుకోలేదా?"

"ఏమిటా సమాధానాలు?

"నీ ప్రశ్నలకి"

తనని తను అదుపులోకి తెచ్చుకుంటూ చురుగ్గా ఆలోచించుకుంది విదిత. ఇపుడు తనేమన్నా తొందరపడితే పోలీసుల ముందే రూడ్‌గా ప్రవర్తించినట్లు అవుతుంది. గొంతు సాధ్యమైనంత మృదువుగా మార్చుకుని, లాలనగా, "నీ మనసులో ఏముందో చెప్పు? ఈ వయసులో నాకు క్షోభకలిగించకు. ఒకవేళ ఎవరైనా ప్రేమిస్తూంటే నీకతనితోనే పెళ్లి జరిపిస్తాను." అంది.

"నా పెళ్ళి మీరెవరూ చెయ్యక్కరలేదు. అవసరమని తోచినప్పుడు నేనే చేసుకోగలను".

"అంటే! ఒంటరిగా వుందామనుకుంటున్నావా?"

"ఇంతవరకూ ఏమీ అనుకోలేదు. ఎప్పుడు ఎలా వుండాలనిపిస్తే అలా వుంటాను."

"ఏమిటమ్మా ఈ మాటలు! వయసులో వున్న ఆడపిల్లవి ఒంటరిగా వుంటే ప్రమాదం కదూ!"

"ఏమిటేమిటి? లయెనెస్ విదితాదేవిగారి మాటలేనా యివి? భర్త బాధలు పెడితే భార్య అతడికి విడాకులు

యిచ్చేసి వేరుగా ఒంటరిగా వుండాలని లెక్చర్లు కొట్టింది మీరుకాదా? పిల్లలున్నాసరే పిల్లలకోసం భర్తకి బానిసగా పడివుండక్కరలేదని ప్రబోధించింది మీరుకాదా? ఆడది అబలకాదనీ ఏ రంగలోనైనా మగవాడికి తీసిపోదని సభలలో ఉద్ఘాటించినది మీరేననుకుంటూ! మీబోటి అభ్యుదయ వాదుల అడుగుజాడల్లో నేను నడుస్తూంటే నన్నా తప్పు పడతారెందుకు?''

నవ్వు ఆపుకోలేక న్యూస్‌పేపర్ గభ్భాల్న ముఖానికి అడ్డం పెట్టుకున్నాడు ఎస్.ఐ. అంత అవమానం ఏనాడూ ఎదుర్కోలేదు ఐయేయస్ విదిత.



''నీకేంకావాలో చెప్పు. అలాగే అన్నీ ఏర్పాట్లూ చేస్తాను. ఇలా పెంకితనాలు వెయ్యకు''.

''నేను స్వతంత్రంగా బ్రతకాలనుకుంటున్నాను. నాజోలికి రావద్దని మాత్రమే నేను కోరు కుంటున్నాను. వస్తాను''.

రెండు చేతులూ జోడించి తల్లికి నమస్కారం చేసి వెళ్లిపోయింది. ఐదారు నిముషాలవరకూ తనని తను కంట్రోల్ చేసుకోలేకపోయింది విదిత. ఎస్.ఐ.తో, ''మీరు నాకొక సహాయం చేయాలి!'' అంది. ఆ గొంతులో వేడికోలులేదు. విదిలింపుతో కూడిన ఆజ్ఞ వుంది.

ఎస్.ఐ.కి యిదంతా చాలాసరదాగా వుంది. అతడి అనుభవంలో యిలాంటి కేసు ఎప్పుడూ చూడలేదు. చిరునవ్వుతో, ''చెప్పండి'' అన్నాడు.

భూమిక ఎక్కడ వుంటుందో ఎవరి అండదండలతో మమ్మల్ని ఎదిరిస్తోందో తెలుసుకుని చెప్పాలి.''

''ఈ సాయంత్రానికే అన్నివివరాలూ చెప్తాను మీకు'' కారులో యింటికొచ్చేసింది. భూమిక మీద కోపంతో మండిపోతోంది మనసు. ముందు ఎలాగో అలాగ యింటికి తెచ్చుకోవాలి. తరువాత చెప్పాలి బుద్ధి.

ఎస్.ఐ. ఆ సాయంత్రానికే భూమికకి సంబంధించిన పూర్తి వివరాలు అందించాడు.

''హైదరబాదులో ''కొత్తతరం'' అనే పేరుతో ఔత్సాహికులైన యువతీ, యువకులు ఒక సంఘం స్థాపించుకున్నారు. పీడిత జనానికి ఎవరికి యేరకమైన సహాయంకావాలన్నా ఆదుకోవటం వారి ముఖ్య ఆశయం. వాళ్లంతా దాదాపురెండు వందలమంది వున్నారు. ఈ కార్యక్రమానికి విరాళాలు పోగుచేస్తారు. వాళ్లల్లో చాలామంది ఉద్యోగాలు చేసుకుంటున్నవాళ్లే. కొందరు చదువుకుంటున్న వాళ్లు. ఆంధ్రప్రదేశం నలుమూలలా యిప్పటికే మంచిపేరు సంపాదించుకుంది ఈ సంఘం. కింది వర్గంవారిలో చట్టపరంగా గాని ఆర్థికంగాగాని సామాజికంగాగాని ఎవరికి ఏ అన్యాయం జరిగినా ఈ సంఘం వారితో చెప్పుకుంటున్నారు. చాలామంది పెద్దమనుష్యులకి అప్పుడే ఈ సంఘం అంటే భయం పట్టుకుంది.''

''ఎక్కడుంటారు ఈ సంఘ సభ్యులు?''

''ఈ సంఘానికి అధ్యక్షులు దీనబంధు. అతనికి స్వంతయిల్లువుంది. సంఘ సభ్యుల్లో ఎవరైనా ఎప్పుడైన ఆ యింట్లో వుండొచ్చు. ఒక మెస్‌లాగ నడుస్తుంది ఆ యిల్లు''.

''దీనబంధా! ఇది అతని అసలు పేరేనా?''

''తెలీదు అందరూ అతన్ని దీనబంధూ'' అంటారు. తెలుసుకోమంటే ఆ వివరాలన్నీ కూడా తెలుసుకుంటాం''.

''అక్కరలేదు.'' ఆలోచించుకుంటూ ఫోను పెట్టేసింది విదిత. ఆరాత్రి పదకొండు దాటాక మందు పార్టీనుంచి బాగా మైకంలో యింటికొచ్చాడు మేఘ శ్యామ్. అతడికి కొంచెం మజ్జిగైనా యివ్వకుండా జరిగిందంతా చెప్పింది విదిత. సగం విని, సగం వినక ''ఊ'' కొట్టాడు అతడు. అప్పటికప్పుడు, ఆ మూడ్‌లోనే స్టేట్ హోమ్ మినిస్టర్‌కి మేఘశ్యామ్‌చేత ఫోనుచేయించి ''ఎలాగైనా ఇరవైనాల్గు గంటల్లోగా దీనబంధుని అరెస్టు చేయించ''మని చెప్పింది. వొంటిమీదసరిగా తెలివిలేని అతడు భార్య ఏం చెప్పమంటే అది చెప్పాడు. ప్రస్తుతం వున్న హోమ్ మినిస్టరు ఎలక్షన్స్‌లో నెగ్గడానికి మేఘ శ్యామ్

చాలా ఆర్థిక సహాయం చేసాడు. అంచేత హోమ్ మినిస్టర్ అతడికి కావలసిన సహాయం చేస్తాడు. భార్య చెప్పినట్లు చేసేసాక, తన కర్తవ్యం పూర్తయిపోయినట్లు బట్టలేనా మార్చుకోకుండా నిద్రపోయాడు, ఆ మర్నాటికి తీవ్ర వాద కార్యకలాపాలతో సంబంధం వుందన్న ఆరోపణతో దీనబంధుని అరెస్టు చేసారు. విజయగర్వంతో నవ్వుకుంది విదిత. ఇప్పుడిక యింటికిరాక ఏంచేస్తుంది భూమిక?

ఆ సాయంత్రం ఈవెనింగ్ ఎడిషన్ న్యూస్‌పేపరు చూసేటప్పటికి విదిత విజయగర్వం ఉఫ్‌న ఎగిరిపోయింది. భూమిక వ్రాసిన సుదీర్ఘమైన లేఖ అన్ని పత్రికల్లోనూ వచ్చేసింది.

డియర్ ఫ్రండ్స్,

మనం పురోగమిస్తున్నామా ఇది పురోగమనమేనా? మీరంతా ఒక్కసారి ఆలోచించండి. ఉదాహరణకి నా విషయమే తీసుకోండి. మాది అత్యాధునిక నవనాగరిక కుటుంబం. మా నాన్న లక్షలార్జించే ఇండస్ట్రియలిస్టు. మా అమ్మ సామాజికాభ్యుదయాన్ని — మహిళాభ్యుదయాన్ని సాధించే ఫేమస్ లయొనెస్. వ్యాపారరీత్యా మా నాన్న అనేక మందికి మందు పార్టీ లిస్తూంటాడు. తీసుకుంటూంటాడు. ఇంటికి వచ్చిన మా నాన్న ఫ్రెండ్స్ అందరికీ అందంగా అలంకరించుకున్న మా అమ్మ మంచి కాలక్షేపం అందిస్తుంది. నేను, మా తమ్ముడు ఇద్దరమే సంతానం. ఆధునికత పుట్టిపడే సంసారం కదా! ఫామిలీ ప్లానింగ్ పాటించారు. ఇంటికి ఫ్రెండ్స్ వచ్చినప్పుడు గొడవ చేయకుండా వుంటే చాలని, మా తమ్ముడికి అడిగినప్పుడల్లా అడిగినంత డబ్బు ఇచ్చేవారు. వాడు తన స్నేహితులతో, సినిమాలకి పోయేవాడు. పట్టుమని పదమూడేళ్ళు నిండని మా తమ్ముడు చూడని సినిమా అంటూ లేదు. జంటనగరాల్లో వచ్చే సినిమాలు అన్ని భాషలవి, అన్ని థియేటర్లలోనూ మార్నింగ్ షోలతో సహా చూసేసేవాడు. ఆ వయసులో వున్న వాడికి ముఖ్యంగా ఇంగ్లీషు సినిమాలన్నా — మళయాళం సినిమాలన్నా తగని పిచ్చి. వాడి మనోభావాలను నేను వర్ణించలేను. మీరే వూహించుకోవాలి. ఇహ నా సంగతి. రోజుకో రకంగా ఫేషన్ పేరేడ్‌లోలాగ అలంకరించుకొనే మా అమ్మ నాకు మార్గదర్శకం. మా అమ్మ యేనాడూ యిలాంటి వెర్రిమొర్రి వేషాలు వద్దని చెప్పకపోగా మరింత ఫేషన్‌గా ఎలా అలంకరించుకోవాలో నేర్పించింది. అబ్బాయిలతోకాని, అమ్మాయిలతోకాని నేనెవరితో ఎలా మాట్లాడినా యింట్లో తల్లిదండ్రులలో ఎవరూ పట్టించుకొనేవారు కారు. నాకూ ఎప్పుడూ బట్టలు, అలంకరణలు స్నేహితులు, పిచ్చి పిచ్చి జోక్సు — ఇదే జీవితం అయిపోయింది. అప్పుడప్పుడు అమ్మ వెనకాల ఫేషన్ బొమ్మలా లయొన్స్ క్లబ్ లేడీ విభాగానికి వెళ్ళి — ఏదో పెద్ద ఫంక్షన్‌కి వచ్చినట్లు ఎంతో ఆడంబరంగా అలంకరించుకొన్న ఆ మెంబర్స్ అందర్నీ కుతూహలంగా చూసేదాన్ని.

"ఈ చీర ఎంతక్కొన్నారు?"

"ఈ గొలుసెక్కడ చేయించారు?"

"ఈ చీర ఫారిన్ షిఫానా" వగైరా మాటలు ఎక్కువగా దొర్లేవి వాళ్ళ సంభాషణల్లో. గుంపులు గుంపులుగా చీలిపోయి అక్కడికక్కడే లోగొంతుకల్లో ఒకరి మీద ఒకరు నేరాలు చెప్పుకునేవారు. ఎవరి గొప్ప వారు చాటుకోవడానికి ప్రయత్నించేవారు. అప్పట్లో నాకిదంతా చాలా సరదాగా వుండేది.

"మెట్రిక్యులేషన్ రిజల్ట్స్ వచ్చాయి. నేను ఫేలయ్యాను. అప్పటివరకు ఏనాడూ నా చదువు గురించి పట్టించుకోని మా అమ్మ ఏం చదువుతున్నానో అసలు స్కూలుకి వెళ్తున్నానో లేదో తెలుసుకోని మా అమ్మ నేను ఫేలయ్యానని వినేసరికి మండిపడిపోయింది. నన్ను ఏమని నిందించిందో తెలుసా?" ఛీ..ఛీ! నీమూలంగా నాపరువంతాపోయింది రేపు నల్గురిలో నాకూతురు మెట్రిక్యులేషన్ ఫేలైందని ఎలా చెప్పుకోను? మిసెస్ సుందరమ్మా శంకర్ కూతురు ఇంటర్ ఫస్టుక్లాసులో పాసై మెడిసిన్‌లో సీటు సంపాదించుకుంది. మిసెస్ కోమలానాయక కూతురు యూనివర్సిటీ ఫస్టువచ్చి గోల్డుమెడలు సంపాదించుకుంది. ఆవిడ ఎంతో గొప్పగా ఆ గోల్డుమెడలు మాకందరికీ చూపించుకుంది. నేను ఏ మొహం పెట్టుకుని మా వాళ్లందరితో నా కూతురు ఫేలైందని చెప్పుకోను! నీ మొహం నాకు చూపించకు."

"నిజంగానే మా అమ్మ రెండ్రోజులవరకు నా మొహం చూడలేదు. నాతో మాట్లాడలేదు. అప్పటివరకూ మా అమ్మకి నేనంటే చాలా ముద్దనీ, ఎంతో గారాబంగా చూస్తుందని, అనుకునేదాన్ని. మా అమ్మ బాధ నాకు చదువులో ఒక సంవత్సరం వృథా అయినందుకుకాదు నా కెరీర్ పాడైనందుకుకాదు. తన ఫ్రెండ్స్ ముందు, "నాకూతురు ఫైలైంది." అని చెప్పుకోవలసి వస్తుందని. అమ్మ పుణ్యమాని చిన్నతనంలోనే మనసుకు పెద్దరికం వచ్చేసిన నాకు అమ్మ ధోరణి అర్థమై ఎంతో బాధ తోచింది. పరీక్షఫేలై బాధపడుతున్న నాకు ధైర్యం చెప్పి మరోసారి ప్రోత్సహించి పరీక్షకి తయారు చెయ్యడానికి బదులుగా అలా నిరసించి విదిలించడం భరించలేకపోయాను. తన కూతురు ఫేలైనట్లు చెప్పుకోవలసిన అవమానాన్ని ఎదుర్కోలేని అమ్మ నన్ను తెలిసిన చుట్టాలింటికి పంపేసి ఓపెన్ యూనివర్సిటీలో ప్రైవేటుగా బి.ఎ.కట్టమంది. తన ఫ్రెండ్సు అందరితో నేను మెట్రిక్యులేషన్ ఫస్టుక్లాసులో పాసైనానని, మద్రాసులో ఇంటర్ చదివిస్తునానని, బి.ఎకూడా అక్కడే చదివిస్తానని చెప్పుకుంది. మా బంధువులింటికి నాఖర్చులకోసం డబ్బు పంపిచడంతో తన కర్తవ్యం తీరిపోయినట్లుగా భావించింది. అదే నాజీవితంలో ఈ మలుపుకి కారణమైంది. మా బంధువుల అమ్మాయి జ్యోత్స్న కొత్తతరంలో సభ్యురాలు. ఆ అమ్మాయి ప్రోత్సాహం,సహకారాలతో నాకు చదువులో శ్రద్ధ కలిగింది. మెట్రిక్ పాసయ్యాను. ఓపెన్ యూనివర్సిటీలో బి.ఎ జర్నలిజం పాసయ్యాను. అందాలు, అలంకరణలు, నగలు, చీరలు, నేరాలు మొదలైన అర్థరహితమైన హడావిడే సంఘసేవ అనుకునే మూర్ఖత్వంలోంచి బయటపడి నిజంగా సంఘ సేవ అంటే ఏమిటో తెలుసుకోగలిగాను. జోత్స్న సహకారంతోనే జర్నలిస్టుగా జీవితం ప్రారంభించాను. ఒకసారి ఈ కొత్తతరంలో జీవితం ప్రారంభించాక తన ఆడంబరాలకి నన్నొక పావుగా వాడుకునే అమ్మ దగ్గిరకి డబ్బు సంపాదించడానికి విపరీతంగా శ్రమపడటం, తరువాత ఆ శ్రమ మర్చిపోవడానికి తప్పతాగడం తప్ప మరో జీవితంలేని నాన్నదగ్గరకి, వెళ్లాలనిపించలేదు. మా అమ్మ కేవలం నామీద కసితో దీనబంధుగారిని అరెస్టు చేయించింది. అంతమాత్రాన బెదిరిపోతే మాది కొత్తతరం ఎలా అవుతుంది? మాలో ఎందరో పెద్ద ఉద్యోగస్థులున్నారు. వాళ్లు సునాయాసంగా దీనబంధుని బెయిల్‌మీద విడిపించగలరు. అంతేగాదు మా సంఘం వల్ల సహాయం పొందిన ఎందరో ప్రజలు దీనబంధుని అరెస్టు చేసిన పోలీసు స్టేషన్‌మీద దాడిచేసి అతడిని విడిపించగలరు. న్యాయస్థానంలో అతడు నిర్దోషి అని నిరూపించుకోగలం.

"మా అమ్మనాకు భూమిక అని ఎందుకు పేరుపెట్టిందో తెలియదు. ఒకవేళ ఎవరైనా ఆవిడకు సూచించారెమో! ఏది ఏమైనా ఒక కొత్త తరానికి స్వతంత్ర స్త్రీ వ్యక్తిత్వానికి నేను భూమికనేమో!

*

